# పరిష్కారం

రామకృష్ణయ్య లేచి కూర్చున్నాడు. సందేహం లేదు. తలుపు ఎవరో దబదబ కొడుతున్నారు. ఎవరీ అర్ధరాత్రి వేళ పిలిచేవాళ్ళు? బయట వాన చప్పుడు మధ్యనుంచి, ఇంకా బాదుతున్న శబ్దం వినిపిస్తూంది.

"ఎవరు?" అని కేకపెట్టాడు గట్టిగా అతను. లేచి మూలనున్న దీపం పెద్దది చేశాడు. అతని గుండెలు కొట్టుకుంటున్నాయి. "ఎవరూ?" అంటూ సావిట్లోకి వచ్చాడు. అతని కేక వినిపించుకోకుండా ఇంకా తలుపు బాదుతున్నారెవరో.

"వచ్చె, వచ్చె. ఎవరు వారు?" అన్నాడతను.

"దారే పోయోవాళ్ళం బాబూ. తలుపు తీయండి" గట్టిగా వినిపించింది ఒక స్త్రీ కంఠం. రామకృష్ణయ్య తలుపు తీశాడు. విసురు గాలితో పాటు ఇద్దరు స్త్రీలు లోపలికి వచ్చారు. వెనకాల బండివాడు. పెట్టె భుజాన పెట్టుకుని లోపలికి వచ్చాడు. దాన్ని క్రింద పెట్టాడు.

"చీకటైనాక రేవులో దిగారు బాబూ ఈళ్ళు. నేను వండినోణ్ణే. లేచి బండి కట్టా" అన్నాడు.

"పాలెం ఎల్లాలిట. ఇక పోలేరని నేనిక్కడ దించా బాబూ. రాత్రికుండి ప్రొద్దున్నే ఎల్తారట" అన్నాడు మళ్ళీ.

వారిలో ఒకామె మధ్యవయస్కురాలు. రెండో ఆమె నిండు చూలాలు. "అయ్యో.నిండు చూలాలిని తీసుకుని బయలుదేరారేమమ్మా ఈ వానలో రాత్రి వేళ!" అన్నాడు రామకృష్ణయ్య అప్రయత్నంగా. ఆ అమ్మాయి పెట్టె మీద కూర్చుంది. బట్టలన్నీ నీళ్లోడుతున్నాయి. ముఖాన కూడా నీటి బిందువులున్నాయి.

"అమ్మా!" అని ప్రక్కకు వంగి రెండో స్త్రీని పట్టుకుంది ఆమె.

"ఏమమ్మా. బాధగా ఉందా?" అని ఆమె తల నిమిరింది ఆ పెద్దావిడ.

"అమ్మాయి మొక్కుందండి దేవరపల్లిలో అమ్మవారికి. ఇంత వరకూ బయలుదేరడం కుదరలేదు. అత్తవారు చివరి వరకు పంపించారు కాదు. అల్లుడు వెంట రావడానికి వీల్లేకపోయింది. రేవులో దిగేసరికే ముంచుకొస్తూంది వాన. అక్కడుండడానికి మనస్కరించక బండివాణ్ణి బ్రతిమాలితే వచ్చాడు వాడు. దేవరపల్లి ఎల్లాగూ చేరలేము. ఇది పెద్ద వూరు కదా. నాలుగిళ్ళు మనవాళ్ళవి ఉంటాయి. రాత్రికి ఉండవచ్చునని అనుకున్నాము బాబూ.ఏం చెప్పనండీ" కూతురు తల నిమురుతూనే చెప్పింది ఆవిడ.

గడియారం పది గంటలు కొట్టింది. బయట వాన కొంచెం తగ్గి, సన్న చినుకులు పడుతున్న చప్పుడు వినిపిస్తోంది.

రామకృష్ణయ్య ఆ అమ్మాయి వంక చూశాడు. మగతగా కళ్ళు మూసుకుని తల్లి నానుకుని కూచుంది. అతనికేమీ తోచడం లేదు. కాని ఏమంటారన్నట్లు చూస్తున్న ఆవిడకు ఏదో ఒకటి చెప్పాలి.

"అల్లాగేనమ్మా... కానీ.. మా ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేరు. నేను ఒంటరివాణ్ణి. అమ్మాయికి ఏం కావాలో మీరే చూసుకోవాలి" అంటూ లోపలి గదిలోకి వెళ్లాడు అతను.

మరో లాంతరు తీసి వెలిగించాడు. తన ఇంట్లో పనిమనిషి మినహా ఇంకో స్త్రీ అడుగు పెట్టి ఎన్నేళ్ళో అయింది. వీళ్ళ కేమి చేయాలో తెలీడం లేదు.

తన చిన్న మంచం మీదున్న పక్క తీసి, క్రింద పడేసి, ఆ మంచం ఇవతలికి తీసుకు వచ్చాడు. తన ఇంట్లో ఉన్నవే రెండు గదులు. సావిడి, వంటిల్లు. తన గది పోతే వంటింటి కివతలగా చిన్న గది ఉంది. ఆ గదిలో రకరకకాల సామాన్లు వున్నాయి.

"అమ్మా! మీరు ఈ రాత్రికి ఈ సావిట్లో పడుకుంటారా?" అన్నాడు అక్కడే మంచం వాల్చి.

"అల్లాగే బాబూ. ఎక్కడైనా సరే.నా పెట్టెలో దుప్పట్లూ అవీ ఉన్నాయి బాబూ. మీరేమీ ఖంగారు పడకండి" అన్నదావిడ. అంటూనే పెట్టె తెరిచి, దుప్పట్లు, జంబుఖానా తీసి,పక్క తయారు చేసింది.

రామకృష్ణయ్య లోపలికి వెళ్లి, వంటింటి గొళ్ళెం తీశాడు. దాలి మీద పాలున్నాయి.చిన్న చెంబు తీసి, దాన్నిండా పాలు పోసి పంచదార కలిపాడు.

సావిట్లో తను వచ్చేసరికి ఆ అమ్మాయి పడుకునుంది. చాప వేసుకుని పెద్దావిడ కూర్చునుంది.

"ఈ పాలు తాగండి... మీరు ఎప్పుడనగా ఎంగిలి పడ్డారో ఏమిటో" అన్నాడతను. ఆవిడ తీసుకుంది.

"మీరు పడుకోండి బాబూ. వంటిల్లు అక్కడేగా వుంది? నీళ్ళూ అవీ కావాలంటే తీసుకుంటా. అర్థరాత్రి వేళమిమ్మల్ని లేపి కూర్చో పెట్టాం. మేమిన్ని చిక్కులు పడడమే కాక, మీ బోటి వారికి కూడా శ్రమ యిస్తున్నాం!" అన్నదావిడ.

రామకృష్ణయ్య నుంచున్నాడు. మెల్లిగా లోపలికి తన గదిలోకి వెళ్ళాడు. దీపం తగ్గించి, చాప మీద దిండు వేసుకుని పడుకున్నాడు. తెల్లవారి లేస్తే వీళ్ళ సౌకర్యాలు ఎలా చూడాలో నన్న ఆదుర్దా కలిగింది అతనికి. పాపం. ఆ అమ్మాయి ఎంతో నలిగినట్లుగా ఉంది. మళ్ళా ఎనిమిది మైళ్ళు బండి ప్రయాణం చేయగలదో లేదో? పనిమనిషి అచ్చమ్మను రేపు కాసేపుండి, వాళ్ళ సౌకర్యాలన్నీ చూడమనాలి. తొమ్మిదిన్నరకల్లా తను బడికి వెళ్ళిపోవాలి. సెలవుల తర్వాత బడి తెరచిన క్రొత్త కాబట్టి చాలా పని ఉంటుంది. వీళ్ళ భోజనం సంగతి ఎల్లాగో?

ఆ ఆదుర్దాలోనే,ఎవరో చూసుకుంటారులే అన్న ధీమా కలిగింది అతనికి. వాళ్ల రాక నుంచి అతని మనస్సులో చెలరేగిన కలవరం కంచెం సర్దుకుంది. మెల్లిగా నిద్ర వచ్చింది.

"బాబుగారూ! బాబు! ఏమండీ!" అన్న పిలుపు తన తలుపు దగ్గర వినిపిస్తోంది. కలేమో అనుకున్నాడు రామకృష్ణయ్య. ప్రక్కకు తిరిగి పడుకున్నాడు. సన్నగా మూలుగు వినిపిస్తోంది. ఆ మూలుగు అతన్ని నిద్రలోంచి లేవగొట్టింది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. కల కాదు. నిజమే. ఆవిడ పిలుస్తూంది తనను. లేచి, ఇవతలికి వచ్చాడు.

ఆవిడ ఖంగారుగా ఉంది. "బాబూ! అమ్మాయికి నొప్పులు వస్తున్నాయండీ" అన్నది.

రామకృష్ణయ్యకు మూలుగు మరీ స్పష్టంగా వినిపిస్తుంది. "అయ్యో! ఏం చేయమంటారండీ?" అన్నాడతను.

"మీకు వల్లమాలిన బాధ్యత తెచ్చి పెట్టాం బాబూ. మంత్రసాని ఎవరైనా ఉండాలండీ. నాకు కాళ్లు చేతులు ఆడటం లేదు" అందావిడ.

ఇంతలో "అమ్మా!" అని బాధగా పిల్చింది ఆ అమ్మాయి. "వస్తున్నానమ్మా" అంటూ ఆవిడ సావిట్లోకి వెళ్ళింది. అతను కూడా వెళ్లాలో లేదో తోచక అల్లా నిలబడ్డాడు.

ఆవిడ మళ్ళా వచ్చింది. "బాబూ, ఈ గదిలోకి ఆ మంచం పట్టాలండీ. మరీ వీధిలోకి ఉంది ఆ గది. ఎల్లా?" అన్నది. అతను తన చాప మడిచేశాడు. సానిట్లోకి వెళ్ళి ఆ అమ్మాయి మంచాన్ని అతి కష్టం మీద యిద్దరూ చెరో వేపు పట్టుకుని ఎత్తుకొచ్చారు. ఆ అమ్మాయి పెద్దగా మూలుగుతోంది. ఏడుస్తోంది. తల్లిని పదే పదే పిలుస్తోంది.

"మీరు వెళ్ళొస్తారా బాబూ?" నిస్సహాయంగా, దీనంగా ఉంది ఆవిడ మాట.

"అల్లాగేనమ్మా వస్తానమ్మా!" అని ఉత్తరీయం తీసుకుని బయటికి వచ్చాడతను. గడియారం నాలుగున్నర కొట్టింది. "తలుపేసుకోండి జాగ్రత్త!" అన్నాడు.

బయట గుడ్డి వెన్నెలకాస్తోంది. ఎక్కడో దూరాన కాకి ఒకటి కలవరింతగా అరుస్తూంది. వీధుల్లో నీళ్ళు నిలిచి వున్నాయి. తన భార్య పద్దెనిమిదేళ్ళ క్రితం ప్రసవ వేదన పడుతుండగా, అర్ధరాత్రి వేళ తన బావమరిది ఇల్లాగే వెళ్లాడు. తను అరుగుమీద తచ్చాడుతూ, ఆకాశం కేసి చూస్తూ వుండిపోయాడు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తనకు అప్పటి నీరసమే ఆవహించింది ఇప్పుడు.

మంత్ర సాని మా లక్ష్మి ఉండే ఇల్లు దగ్గర్లోనే ఉంది. ఆ గుడిసెల వేపు తను ఎన్నడూ పోలేదు. స్కూలు జవాను ఇల్లు మాత్రం తనకు తెలుసు. వాడి పెళ్ళయినప్పుడు వాళ్ల వాళ్లొచ్చి తనను ఎంతో సంబరంగా ఆహ్వానించి తీసుకెళ్లారు నాలుగేళ్ల క్రితం. అప్పట్లో చూసిన గుర్తు.

"రాములూ!" అని పిల్చాడు ఆ ఇంటి ముందు నిల్చుని.

"ఎవరూ?" అన్న కేక వినిపించింది. రెండు నిమిషాలకు బయటికి వచ్చాడు వాడు. చీకట్లో పరకాయించి చూశాడు. "తమరా బాబూ! ఇదేటి బాబూ! ఏమైంది?" అన్నాడు ఖంగారుగా.

"ఏమి కాలేదు రాములూ. చూడు ఇక్కడ మంత్రసాని మాలక్ష్మి ఉండాలి కదూ!"

వాడు ఆశ్చర్యపోవడం ఆ చీకట్లో కూడా స్పష్టంగా కనుపించింది. "మంత్ర సానా బాబూ!" అన్నాడు వాడు.

"ఔను. దారేపోతున్నవాళ్లెవరో రాత్రి మా ఇంట్లో దిగారు. ఆ పిల్ల నొప్పులు పడుతోంది. త్వరగా కేకెయ్యాలి రాములూ!" అన్నాడు రామకొష్ణయ్య.

"తమరు వెళ్ళండి బాబూ. నేను గబుక్కున కేకేసి, వెంట తీసుకొస్తా" అన్నాడు వాడు.

"లేదు... నేనుంటా. పిల్చుకురా" అన్నాడు అతను. రాములు వెళ్లాడు. పది నిముషాలు దిక్కులు చూస్తూ నిలబడ్డాడు రామకృష్ణయ్య. కోళ్లు కూస్తున్నాయి. అక్కడక్కడ మనుష్యుల అలికిడి ఔతూంది. తెల్లవారితే, వెలుతురు వస్తే బాగుండుననిపించింది రామకృష్ణయ్యకు.

వాళ్లు వచ్చారు. మాలక్ష్మి దండాలు పెట్టింది. "పంతులుగారు నన్నెతుకుతా ఒచ్చినారా?"అన్నదది వినిపించీ వినిపించని నవ్వుతో.

ఇంటికి చేరేసరికి తలుపు బార్లా తీసి వుంది. సావిట్లోలాంతరు పెద్దదిగా వెలుగుతోంది. గదిలో మనుష్యుల అలికిడౌతూంది. వీళ్ళు రావడం విని, ఆవిడ వచ్చింది.

"వచ్చిందా మంత్రసాని?" అంటూండగానే మా లక్ష్మి లోపలికి వెళ్లింది. అమ్మాయి ఏడుస్తూంది. పెద్దగా మూలుగుతూంది. అయ్యో పాపం అనిపించింది రామకృష్ణయ్యకు. రాములు, అతను అరుగు మీద నిలబడ్డారు.

'రాములూ! వేణ్ణీళ్ళూ అవీ కావాలి కాబోలు. అచ్చమ్మని కేకేసుకు వస్తావా? సాయంగా ఉంటుంది." అన్నాడతను.

సావిట్లోంచి ఇద్దరు ఆడవాళ్ళు ఇవతలికి వచ్చారు. పక్కింటి అవధాన్లు గారి భార్య, కోడలు. "మాస్టరుగారూ, మీరు వెళ్లొచ్చారా మాలక్ష్మి కోసం? మమ్మల్ని కేకేస్తే,అబ్బాయిని పంపిద్దుము కదా!" అన్నదావిడ.

"నాకు ఏమీ తోచింది కాదండీ.. ఎల్లా ఉంది అమ్మాయి?" అడిగాడు.

"ఫరవాలేదు. మొదటి కాన్పుట. కొంచెం తంటా. ఆ పిల్లతల్లి ధైర్యస్థురాలేనండీ. మమ్మల్ని కేకెట్టింది. మా కమతగాడిని,వాడి పెళ్లాన్ని ఇక్కడికి పంపి మేమూ వచ్చాం. దొడ్లో నీళ్ళూ అవీ చూస్తున్నారు" అన్నదావిడ.

లోపలికి వెళ్ళబోయి, వెనక్కు తిరిగొచ్చి అందావిడ. "చూడండి మాస్టారూ. పది పదిహేను రోజులు దాకా వాళ్ళు కదిలేందుకు వీల్లేదు. మీరేమీ తంటాలు పడకండి. అన్నిటికీ మేమున్నాం. కాకపోయినా ఆవిడ సమర్థురాలేలెండి నెట్టుకొస్తుంది" అని.

లోపల్నించి 'కేర్' మని వినిపించిన ధ్వని రామకృష్ణయ్యను ఉక్కిరి బిక్కిరి చేసింది. తన ఇంట్లోనే ఈ శబ్దం! ఆశ్చర్యంగా భయంగా ఉన్నది తనకది. లోపలికి వెళ్లాడు. తచ్చాడాడు సావిట్లో. గడియారంలో ఐదున్నరైంది.

కాస్సేపటికి మాలక్ష్మి బయటకు వచ్చింది. "ఆడపిల్ల పంతులుగారూ! తమరింట్లో పుట్టింది లక్ష్మిం. తెల్లగా ఇంతుంది" అన్నదది. దాని మొహం సంతోషంగా ఉంది. హడావిడిగా తిరుగుతోంది అది.

ఆ ఉదయమంతా ఎల్లా గడిచిందో రామకృష్ణయ్యకి తెలీదు. తనేమీ చేయకుండానే అన్నీ సవ్యంగా జరిగాయి. వంటలయ్యాయి. పాపాయి స్నానం అయింది. అమ్మాయి సుఖంగా నిద్రపోయింది. అచ్చమ్మ అక్కడే వుంది సాయానికి.

రామకృష్ణయ్య ఎనిమిది గంటల ప్రాంతాన ఆవిడ నడిగాడు. ఎవరికేనా కబురు పంపించాలేమోనని.

ఆవిడ అడ్డంగా తలూపింది. "ఎందుకు బాబూ? వాళ్ళ నాన్నగారొక్కరే విని సంతోషించేందుకు ఉన్నారు. కార్డు వ్రాస్తాను. అల్లుడేమో అదేదో ఉత్తరదేశంలో ఊరుందిట. అక్కడికి వెళ్లాడు ఉద్యోగరీత్యా.... ఐనా మేమే వెడతాం. నాల్గురోజుల్లో. మీకు శ్రమెందుకు?" అన్నది.

"నాకు శ్రమ ఏముందండీ? స్కూలు జవనానును పంపిస్తాను" అన్నాడతను.

"ఇక్కడుందా బాబూ పంపడానికి? ఓ పూట ప్రయాణం. బండి, పడవ, నడక ఎవ్వో గడవాలాయె వద్దు బాబూ"' అన్నదావిడ. వంటింటి పనిలో మునిగిపోయింధి. ఎంతో అలవాటున్న మనిషల్లే అన్నీ సర్దుకుంది.

బడికి వెళ్లే ముందు ఆవిడ వడ్డిస్తే భోజనం చేశాడు రామకృష్ణయ్య.

ఆదివారం మధ్యహ్నాం నాలుగైంది. రామకృష్ణయ్య సావిట్లో బల్ల మీద కూర్చున్నాడు. నెలకు సరిపడా తనకోసం తెచ్చుకున్న వెచ్చాలు చాలేటట్లు లేవు. అతను పద్దు పుస్తకం తీసి, మళ్లీ ఓ జాబితా సరుకుల కోసం వ్రాయసాగాడు. పురిటినాడు, ఆ తరువాత కూడా కొంత పార్వతమ్మ.. ఆ పిల్ల తల్లి ఖర్చు పెట్టినట్లుంది.

మధ్యాహ్నాం భోజనం తరువాత ఇంట్లోకి కావలసిన చిన్న చిన్న సరుకులు చెప్పి, ఓ పదిరూపాయనోటు తన చేతిలో పెట్ట బోయింది ఆమె. వద్దని ఇవతలికి వచ్చేశాడు తను.

వాళ్ళొచ్చి ఆరు రోజులైంది. ప్రొద్దున్న లేవడమే చంటిపాప ఏడుపు వింటూ. మధ్యాహ్నం బడి నుంచి అతను ఇంటికి వచ్చాడు ఈ నాల్గురోజులూ. వాళ్ళ కేమి అవసరం వస్తుందోనని. మొదటిరోజు మాత్రం ఊరుకుంది ఆవిడ. మర్నాటికి మినపప్పు నానబోసి, రొట్టె ముక్క కాల్చి పెట్టింది. అందువల్ల, ఆవిడ ఎదురు చూస్తూంటుందని తప్పనిసరిగా మధ్యాహ్నం వస్తున్నాడతను.

జాబితా పూర్తి చేసి, తన జేబులోంచి పర్సు తీసి డబ్బు లెక్క చూశాడు. ఫర్వాలేదు. సులభంగా గడిచిపోతుంది. దక్షిణాది యాత్ర కోసం తను దాచుకున్నది తీయనక్కర్లేదు.





"బాబూ, నేనూ సీతా రేప్రొద్దున్న బయలుదేరుతాం" అన్నది పార్వాతమ్మ. ఆమె వచ్చి గుమ్మం దగ్గర నిలబడిన సంగతే చూడలేదేమో అతను ఉలిక్కి పడ్డాడు. సరుకులు కావాలని తనతో చెప్పిన ఆవిడ.. ఇల్లాగ అంటున్నందుకు ఆశ్చర్యం వేసింది అతనికి.

"తెల్లారగట్ల బయలుదేరితే పొద్దెక్కకుండా రేవు చేరుతాం" అన్నది మళ్ళీ.

రామకృష్ణయ్య ఏమీ అనలేకపోయాడు. వాళ్ళు వెడతానంటూంటే ఉండమని అనాలనే అనిపిస్తూంది.

"వచ్చి వారం రోజులౌతోందా? అక్కడ వాళ్లంతా గాభరా పడుతుంటారు" అంది పార్వతమ్మ మళ్ళీ.

"ఉత్తరం వ్రాయలేదు గదండీ మీరు? అమ్మాయిని కదిలించ వచ్చో లేదో.. నాల్గురోజులుండి..."

పార్వతమ్మ వెంటనే అందుకుంది. "లేదు బాబూ, మేము వెళ్లాలి. ఒక కార్డు ముక్క వ్రాశాననుకోండి" అన్నది.

ఒక్క నిముషం రామకృష్ణయ్య మాట్లాడలేదు. పద్దు పుస్తకం లోంచి వెచ్చాల చీటీ తీసుకుని చూడసాగాడు.

పార్వతమ్మ లోపలికి వెళ్లిపోయింది. గడియారం ఐదు కొట్టింది. టీ తీసుకొని వచ్చి ఆమె బల్ల మీద పెట్టింది.

"సరే లెండి. పదకొండోనాడు స్నానమైనాక బయలుదేరుతాము. దానికీ వంట్లో ఏమంత ఇదిగా లేదు" అన్నది.

"వచ్చే వాళ్లు ఎవరూ లేరు లెండి. వాళ్ల నాన్నగారికి పెద్ద వయస్సు. అదీకాక. మేము వస్తామని రాసేశాను" అంటూ టీ గ్లాసు తీసుకొని వెళ్లిందామె

రామకృష్ణయ్య లేచి కూర్చున్నాడు. గుక్క పట్టి ఏడుస్తోంది పాపాయి. దొడ్లోకి మెల్లిగ వెళ్లాడు. వంటిల్లు తలుపు గొళ్లెం వేసి ఉంది. దొడ్లో కాగు క్రింద పుల్లలు మండుతున్నాయి. పురిటి స్నానానికి నీళ్లు కాస్తున్నట్లుంది ఆమె.

"అచ్చమ్మా!" అని కేకవేశాడు. ఎవరూ పలకలేదు. ముఖం కడుక్కుందామని కాగులోంచి ఓ చెంబెడు నీళ్ళు ముంచుకున్నాడు. పాపాయి ఏడుపు ఇంకా వినిపిస్తోంది. ఏడుపు ఆగటం లేదు. చెంబు క్రింద పెట్టి, మండువాలోకి వచ్చాడు అతను. గది గుమ్మం దగ్గర లాంతరు సన్నగా వెలుగుతోంది. పాపాయి గుక్క పట్టి ఏడుస్తోంది. లోపలతల్లి ఉన్నదీ లేనిదీ తెలియలేదు.

"పార్వతమ్మగారూ" అని పిల్చాడతను. లాంతరు పెద్దది చేసి గదిలోకి తొంగి చూశాడు. గదిలో ఎవరూ లేరు. అతని గుండెలు దబదబ కొట్టుకున్నాయి. మంచం మీద పక్కలో పాపాయి. లాంతరు పట్టుకుని సావిట్లోకి వచ్చాడు. గడియారం ఐదు గంటలు కొడుతూంది. సావిడి తలుపు దగ్గరగా వేసి వుంది.

మళ్ళీ కంగారుగా గదిలోకి వెళ్లాడు. గదిలో పెట్టె లేదు. గదంతా పాపాయి ఏడుపుతో గింగురు మంటోంది.

అతనికి ఏం చేయాలో తెలీలేదు. ఏమైనారు వీళ్లు? ఎక్కడికి వెళ్లారు? చెప్పలేని భయం అతనిలో బయలుదేరింది. క్రమ్ముకుంటున్న పొగలా గుబులు ఆక్రమించుకుంది అతని మనస్సును, పాపాయిని ఊరుకోబెట్టాలని తోచలేదు. మంచం దగ్గరికి వెళ్లి చూస్తూ నిలబడ్డాడు.

"బాబూ!" అన్న అచ్చమ్మ పిలుపు వినిపించింది. ప్రవాహంలో కొట్టుకుపోయేవాడికి ఆధారం దొరికినట్లయింది.

"ఆ అమ్మగారు ఏరండీ బాబూ.." అన్నది అది గదిలోపలికి వచ్చి. పాపాయిని మెల్లిగా బట్టలు తీసి తన చేతుల్లోకి ఎత్తుకుంది అది. పాపాయి ఏడుపు తగ్గించింది.

అచ్చమ్మ మాటకు సమాధానం ఇవ్వకుండానే రామకృష్ణయ్య వాకిట్లోకి వచ్చాడు. ప్రక్కింటి అరుగు మీద అవధాన్లుగారు ముఖం కడుక్కుంటున్నారు.

"ఏమండీ మాయింట్లో వున్నవాళ్లు ఎక్కడికేనా వెళ్లారేమో మీకు తెలుసాండీ?" అన్నాడతను.

అవధాన్లు తెల్లబోయాడు. "ఎక్కడికి వెళ్లడమేమిటి? లేరూ మీ యింట్లో.. పిల్ల ఏడుపు వినిపిస్తూందే!" అన్నాడు.

రామకృష్ణయ్యకు మళ్లా ఆ గుబులుతో మనస్సంతా భారమై పోతూంది. "అదేనండీ పిల్లని ఒదిలేసి వాళ్లు వెళ్లారు. సామాను కూడా లేదు. మీ వాళ్ల నడుగుతాను" అతని కంఠం గాద్గదికమైంది.

అవధాన్లు భార్య ఈలోగా బయటికి వచ్చింది. "ఏమిటండీ.. వాళ్లు పిల్ల నొదిలేసి వెళ్లిపోయారుటేమిటీ? అచ్చమ్మ చెబుతోంది" అంటూ కొడుకు కోడలు కూడా వచ్చారు వాకిట్లోకి. అచ్చమ్మ వచ్చింది.

"ఇది తమాషాగా వుందండి. ఏ ఊరు వాళ్లది?" అన్నాడు అవధాన్లు కాస్సేపాగి.

"రాజమండ్రి అని చెప్పింది లెండి ఆవిడ. ఇదేదో దిక్కుమాలిన సంతానం కాబోలు!" అందరి మనస్సులో లీలగా బెరుకుగా మెదులుతున్న సంశయాలకు ఒక్క ఉదటున సమాధానం దొరికింది అవధాన్లుగారి భార్య అన్న ఈ మాటతో..

రామకృష్ణయ్య నిస్సహాయంగా చూశాడు. పిల్లను చేతుల్లో ఎత్తుకుంది అచ్చమ్మ.

"మాస్టారూ.. మీరు అల్లా ఇదైపోకండి. కనుక్కుందాం సంగతేమిటో.... చూడవే ఆపిల్లకి పాలు కావాలో, నీళ్లు కావాలో!" అన్నాడు అవధాన్లు.

రామకృష్ణయ్య లోపలికి వెళ్లాడు. ముఖం కడుక్కున్నాడు.

"బాబుగారూ ఆ అమ్మాయిగోరు నిన్న మధ్యాన్నం ఏడుత్తున్నారండీ... ఆ అమ్మగోరు ఒకటే గుసగుసగా ఏటో సెప్తున్నారండీ. ఈ పసిగుడ్డును ఇల్లా వదిలేయాలని ఆళ్లు అప్పుడే అనుకునుంటారండీ!" అన్నది అచ్చమ్మ. కుంపటి అంటించి, అతనికిచ్చి మళ్ళా అవధాన్లుగారింట్లోకి వెళ్లిందది.

కాఫీకి నీళ్ళు పెట్టి, కుంపటి వంక చూస్తూ కూర్చున్నాడు రామకృష్ణయ్య. అతని స్థితి అయోమయంగా ఉంది. తనేం చెయ్యాలి ఈ పిల్లను? వాళ్లు ఏమనుకుని ఈ పాపను తన మీద వదిలేశారు? అతని మెదడు వేడెక్కుతోంది.

అచ్చమ్మ పాపాయిని తీసుకుని దొడ్డి గుమ్మంలోంచి వచ్చింది.

"అయ్యగోరూ... మీరు దుకాణానికి ఎల్లి పాలడబ్బా తేవాలండీ!" అన్నదది. అతను కాఫీ కలుపుని త్రాగాడు.

ఈలోగా అవధాన్లు గారి భార్య వచ్చింది. "మాష్టారూ... ఆవిడ రాజమండ్రి అని చెప్పింది కాబట్టి మీరీ పూట బయలుదేరి వెళ్లి వాళ్ల ఆజ కనుక్కురండి. మేం చూస్తాం పిల్లని ఈ రెండు రోజులూ. అంతగా వస్తే" అన్నదావిడ.

అతను కూడా ఏదో ఒక ప్రయత్నం చేయాలనుకుంటున్నాడు. వాళ్లను అందుకోవడానికి. వెదుతూనే ఈ పిల్లను తీసుకెళ్లి వాళ్ల మొహాన పడేస్తే, తన భారం తగ్గుతుంది. కానీ ఎల్లా తనకు అలవాటు లేని ఈ పిల్లని తీసుకుని వెళ్లడం? తన చేతులకు అలవాటు లేదు ఇంత పసిగుడ్డును ఎత్తుకోవడం. వాళ్లు అఖ్ఖర్లేదని వదిలేసిన పిల్లను తను తీసుకుని వెడితే మాత్రం తీసుకుంటారా?

ఆమె వంక ఒక్క నిమిషం చూశాడు. ఈ పిల్ల తన ఇంట్లో జన్మించడం సంభవించింది కాబట్టి, ఆ బాధ్యత తనదే అన్నట్లుగా రెండు రోజులు చూస్తామంటున్నారు వీళ్ళు. ఆ శిశువు బాధ్యత వాళ్లదీ, దారిపోయే ప్రతి ఒక్కరిదీ, ఊళ్లోని ప్రతి ఒక్కరిదీ కాదూ? గిర్రున తిరుగుతున్న తలను చేత్తో అదిమి పట్టాడతను.

"అల్లాగేనండీ.." అన్నాడు. బడికి సెలవు చీటీ వ్రాసి పంపాడు. దుకాణానికి పాల జబ్బాకోసం పంపించాడు. దానితో పాటు మరి నాలుగు వస్తువులు చెప్పింది అవధాన్లుగారి భార్య.

మధ్యాహ్నం మూడైంది. అతను రాజమండ్రి చేరేసరికి. ఆమె మాటల సందర్భంలో చెప్పిన గుర్తులు ఆధారంగా వెతుకుతూ బయలు దేరాడు. ఆయన పేరైనా తెలియదు ఏమని వాకబు చేస్తాడతను?

సందులు ఎన్నో తిరిగాడు. అయోమయంగా ఎవరు చెప్పగలరు? అటు వంటి వాళ్లే లేరన్నారు ఎవర్నడిగినా. ఆ ఇంటి పేరుగలవారు ఆ ప్రాంతంలోనే లేరని తేలింది... ఆరయ్యేసరికి.

ఎండలో తిరిగి తిరిగి కాళ్లు మంటలు పుడుతున్నాయి. రైలు స్టేషను దగ్గరికి వెళ్లాడు. ఏదో ఆశతో. సోడాబండి వాడి దగ్గర సోడా కొనుక్కుని త్రాగాడు. కంటికి కనపడ్డ కూలీవాణ్ని కేకేసి అడిగాడు. ఎవరేనా ఇద్దరు ఆడవాళ్లు రైలెక్కారా వచ్చి.. అని. వాడు నవ్వాడు. "ఎంతమందో ఎక్కుతారండీ బాబూ! అల్లాగేం చెప్పలేం" అన్నాడు.

మరోణ్ణి, మరోణ్ణి అల్లా అడిగాడు. నడికట్టు వేసుకున్న  ఒక పదిహేడేళ్ల పిల్ల, ఒక నడివయస్సావిడ హౌరా వేపు పోయే రైలెక్కారనీ ఎక్కడికో తెలీదనీ చివరికి ఒకడు చెప్పాడు. బెంచీ మీద కూర్చున్నాడు కాస్సేపు. రైలు చప్పుడు, ప్రయాణీకుల హడావిడి. అమ్ముకునే వాళ్ల కేకలు.. తను మళ్లీ తిరిగి ఆ ఇంటికి వెళ్ళనక్కర్లేకుండా ఈ సందడిలోనే తన బ్రతుకు వెళ్లిపోతే బాగుండుననిపించింది అతనికి. కానీ... ఆ అదృష్టం లేదతనికి.

ప్రొద్దున్నే మొదటి లాంచీకి బయలు ఒరాడు.. నీటి మీద హాయిగా పడవలాగా తేలిపోయే తన బ్రతుకుకు ఒక గుదిబండ తగులుకుంది. ప్రవాహంలో పడవ మునిగిపోవడానికే ఇది.

భార్య పోయిన తర్వాత ఈ పద్దెనిమిది సంవత్సరాలలోను ఎంతో మంది అతనిని మళ్లీ పెళ్లి చేసుకోమని సలహా ఇచ్చారు. ఆమె ఉన్నన్నాళ్ళూ ఆమె జబ్బుతోనే సరిపోయింది తనకు. తన బ్రతుకును, మనస్సును అతిభారంగా చేసి వేసింది ఆమె వ్యాధి. ఈసురోమంటున్న ఆమె గర్భవతి కూడా ఐంది. ఆ పురుడే ఆమె ప్రాణం తీసింది. రెండు మూడు సంవత్సరాలకాలం తనను సందిగ్ధంలో. అశాంతిలో కాల్చి వేసిన ఆ స్థితి అంతమై పోయినది ఆమె మరణంతో. అప్పట్నించి బంధనాలు లేని జీవితమే అతనికి అలవాటైంది.

అటువంటి తనకా యీ యీడులో ఈ బంధనం?

రామకృష్ణయ్య యింటికి చేరేసరికి పాపాయి సుఖంగా నిద్ర పోతూంది. అవధాన్లుగారింట్లో తను చెప్పిన సంగతులు విని, వాళ్లు నిట్టూర్చారు.

"ఏ జన్మలోనో  రుణపడి వున్నారండీ మాస్టారూ మీరు. ఇల్లా వసూలు చేసుకుపోతోంది. దీనికి పేరు కూడా పెట్టాడు మా మనవడు. శశిరేఖట! బాగుందా!" అవధాన్లు గారి మాటల్లోని హుషారు అర్థం కాలేదు రామకృష్ణయ్యకు.

ఆరాత్రి తెల్లవారదేమో అనిపించింది అతనికి. అతని మనస్సు పరిపరివిధాల పోతూంది. కానీ ఆ

భయాల్లోంచే. ఏదో ఒక శాంతి గోచరించింది. ఎవరో ఆకాశం మీద నుంచి ఊడిపడి, ఈ సమస్యను హఠాత్తుగా పరిష్కరిస్తారనిపించింది అతనికి.

ఆ ఉపశమనం ఎందుకు కలిగిందో తెలీదు. కానీ ఆరాత్రి అతనికి కాళరాత్రి కాకుండా, తెల్లవారింది.

❋

శశికి జ్వరంగా ఉంది. వారం రోజుల జ్వరం ఇప్పుడే నిమ్మళించింది. నీరసంగా చూస్తూ పడుకుంది మంచం మీద. రామకృష్ణయ్య స్కూలుకు సెలవు పెట్టి. అది నిద్రపోకుండా చూస్తూ కూర్చున్నాడు. జ్వర తీవ్రతలో అది పడిన బాధ, తను పడిన వేదన, రాత్రిళ్ళు నిద్ర లేని చీకాకు, చిళ్ల పెంకుల్లాగా డబ్బు ఖర్చుపెట్టవలసి రావడం.. అదంతా ఓ దుస్వప్నంలాగా ఉంది. నిజమే! రుణపడబట్టే వసూలు జరుగుతోంది.

పీక్కుపోయిన పసి ముఖంలో, మెరుస్తున్నాయి ఆకళ్లు. ప్రొద్దున్నుంచి ఒకే తీరుగా వాగిస్తూంది. అన్నం తినక మారాం చేసింది. చివరికి అవధాన్లుగారి భార్య ఎంతో బ్రతిమాలి దాని చేత చారు అన్నం తినిపించింది.

రామకృష్ణయ్య ప్రాణం విసిగింది మధ్యాహ్నానికి. ఇంతే కాదు తెల్లవారి లేస్తే ఎదురింటి పిల్లలతో ఏదో పేచీ తీసుకు వస్తుంది. ఏమిటో సమస్యలు. ఎన్నో చీకాకులు!

రామకృష్ణయ్య కళ్లు మూసుకున్నాడు. ఆ పసి దాని ముఖంలోకి చూసినప్పుడు ఒక్కోసారి జాలనిపించినా, తన ప్రాణం తోడేస్తోంది అది.

తనసీ పరిస్థితుల్లోకి ఎందుకు నెట్టాలి మరొకరు? తన మనస్సు కసిగా. ఈ పరిస్థితికి ఎదురు తిరుగుతోంది. నిర్మలమైన చెరువులాంటి తన జీవితంలో ఒక్కరాయి విసిరి, శాంతిని చెడగొట్టింది ఒక సంఘటన.

తనేమి ద్రోహం చేశాడు వాళ్లకు. ఇల్లా తనమీద కసి తీర్చుకోవడానికి? అర్ధరాత్రి వేళ ఆర్తులై వచ్చిన వారికి ఒక ఆశ్రయం కల్పించి నందుకేనేమో ఈ శిక్ష! వాళ్లు తనను మోసం చేశారు. తనను వెర్రి వాణ్ణి చేసి. అన్యాయం చేశారు. ఇదే బాధ అతన్ని ఊపివేస్తూంది.

తన ఇష్టంతో నిమిత్తం లేకుండా, తన ప్రమేయమేమీ లేకుండా జరిగిన ఒక సంఘటనతో తన జీవితమే అపమార్గం పట్టింది. ఈ బంధనం అతన్ని భౌతికంగా కాక, మానసికంగా క్రుంగదీస్తోంది. ఒక్కొక్కప్పుడు ఆ పిల్లను తీసుకు వెళ్లి ఎక్కడేనా వదిలేద్దామన్నంత కసి పుట్టుకొస్తోంది యీ మధ్య.. కానీ ఎల్లా? ఎల్లా?

❋

కొండల మీద నుంచి వస్తోందేమో గాలి చల్లగా వుంది. జిల్లుమనిపిస్తూంది. సంచి మెట్ల ప్రక్కనే ఉన్న చిన్న దుకాణం వాడి కప్పుగించి,అంగోస్త్రం తీసుకుని బయలుదేరాడు రామకృష్ణయ్య. ఆడవాళ్లు, మగవాళ్లు. పిల్లలు బిల బిల లాడుతున్నారు పుష్కరిణి ఒడ్డున.

పై మెట్టుమీద నిలబడి ఏవేపు వెళ్ళడమా అని చూస్తున్నాడు రామకృష్ణయ్య. హఠాత్తుగా ఆవిడ! ఆవిడే. సందేహం లేదు. మెట్లెక్కి వస్తున్నదల్లా, పార్వతమ్మ అతన్ని చూసి టక్కున ఆగింది. వెంటనే వెనక్కు తిరిగి. మళ్ళీ నీళ్ళల్లో దిగింది. రామకృష్ణయ్య గుండె దడదడలాడింది. అతను కూడా దిగసాగాడు మెట్లు.

ఆవిడ వెనక్కు తిరిగి చూసింది. ప్రక్కనున్న ఆడవాళ్ల వంక చూసి చటుక్కున చేత్తో అతన్ని రావద్దని వారించింది. తను వస్తున్నా నని సైగ చేసింది.

దబదబ మెట్లెక్కి రామకృష్ణయ్య ఉన్న మెట్ల మీదకు వచ్చింది. అతణ్ణి ఆనుకునేలా నిలబడి, "బాబూ! మీతో మాట్లాడాలి. పదండి" అన్నది.

యాంత్రికంగా ఆమెతో పాటు పరుగుల మీద జనసమ్మర్దం లేని ఒక ప్రక్కకు చేరాడతను.

"బాబూ, మీరు మమ్మల్ని కాపాడాలి. మా బ్రతుకు మీ చేతుల్లో వుంది" అన్నది. ఆమె కళ్లనిండా నీళ్లు.

అతనికి ఏవో మాటలు వస్తున్నాయి. కానీ ఏదీ రావడం లేదు నోట్లోంచి. ఆమెను ఎన్నో మాటలనాలని, తను ఈ రెండేళ్ళలో అనుభవించినదంతా వెళ్లగ్రక్కాలనీ...

పార్వతమ్మ వస్తున్న ఏడుపును బిగపట్టుకుంది. "బాబూ. రామకృష్ణయ్య గారూ... మీరు దేముడు లాంటి వారు. మీరే మాకు దిక్కు. అమ్మాయికి పెళ్ళి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో యీ రాత్రికి.."

అంత కోపంలోనూ అతను ప్రశ్నించాడు "ఏ అమ్మాయి?" అని.

"మా సీతకి బాబూ... ఆపిల్ల దిక్కుమాలినపనండీ. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. మా పెద్దమ్మాయికి జబ్బుగా వుందని ఉపచర్యకి నేనూ, అదీ వెళ్ళాం అల్లుడు గారింటికి. అక్కడ మా పెద్దల్లుడే బాబూ. కుర్రతనం కొద్దీ వెధవ పని చేసి దీని బ్రతుకు బండలు చేశాడు. నాలుగో నెల వరకూ తెలిసింది కాదు. ఏదైనా కాని పనికి పూనుకంటే, దాని ప్రాణానికే ముప్పని అక్కణ్నించి బయలుదేరి, విశాఖపట్నంలో కాపురం పెట్టాము. నేనూ అదీ.. మూడు నెలలు ఎల్లాగో వెళ్ళబుచ్చాం."

రామకృష్ణయ్య ఆవేశం లోంచి బయటపడ్డాడు. తను, తన చుట్టూవున్న లోకం ఇన్నాళ్ళూ లోపల బిగ్గరగాను అనుకుంటున్న విషయమే ఈవిడ నోట వినవస్తూంది. ఐనా తన కిది క్రొత్తగా ఉంది.

"అక్కడివాళ్ళూ గుసగుసలు మొదలెట్టారు. ఎన్నాళ్ళని మూస్తాం లోకం నోరు? అల్లుడు రాడేంమిటని ప్రశ్నలు. చివరికి దానికి తొమ్మిదో నెల వచ్చేసరికి, యింటి వాళ్ళే ఖాళీ చేయమని కూర్చున్నారు. ఎక్కడికేనా నరుని కంట పడకుండా పోదామని బయలుదేరాము. చిన్ననాడు చూసిన ఊరు మీ వూరు గుర్తుకొచ్చింది. కనుపించిన తలుపు కొట్టాం. మా అదృష్టం వల్ల మీరు తారసపడ్డారు. సీత బ్రతుకుతుందనుకోలేదు బాబూ. అది దక్కదనే అనుకున్నాను" ఆవిడ ఆపుకునే ప్రయత్నం లేకుండా ఏడుస్తోంది. తన మనస్సులో భారం తీర్చుకున్నందువల్లో, లేకపోతే ఆనాటి తన దీన స్థితి తలచుకునో... అర్థం కాలేదు రామకృష్ణయ్యకు.

ఆమె కళ్ళు తుడుచుకుంది. "బాబూ, అప్పట్నించి వెతుకుతూంటే ఈనాటికి ఒక సంబంధం కుదిరింది. మద్రాసు వాళ్ళు. రేపు దాన్ని అత్తారింటికి పంపేస్తే, అక్కడికి ఓ దోవన పడుతుంది దాని బ్రతుకు. అది ఏ నుయ్యో గొయ్యో చూసుకోకుండా కాపాడుకొచ్చాం."

మళ్ళీ మేఘాలు ముసురుకొంటున్న ఆకాశంలా మలినమైంది ఆమె ముఖం. "బాబూ! మీరు కాపాడాలి మమ్మల్ని. మీ చేతుల్లో ఉంది మా ప్రాణం. అదుగో. వాళ్ళు నా కోసం వెతుక్కుంటున్నారు. రాత్రికే ముహూర్తం" చటుక్కున వెళ్ళబోయింది. "బాబూ! మీరు మాట ఇస్తే గాని నేను వెళ్ళలేను. సీత మిమ్మల్ని తలచుకోని క్షణం లేదు. దాన్ని పసుపు బట్టలతో చూస్తే ఇక ఈ జన్మకి ఏమీ అక్కర్లేదు."

రామకృష్ణయ్య నిట్టూర్చాడు. ఇక తేలిపోయింది ఈ విషయం. తనిక ఆ పిల్లను వదుల్చుకునే దారిలేదు.

"మీరు వెళ్ళండి" అన్నాడతడు. పార్వతమ్మ దీనంగా చూసింది. "మిమ్మల్ని నమ్ముకున్నాను బాబూ. వచ్చే జన్మలోనైనా తీర్చుకుంటాం మీ రుణం!" అన్నది.

మళ్ళీ వెళ్ళ బోయి. "బాబూ! పిల్ల......" అంటూ ఆగింది.

"బాగానే ఉంది. రెండో ఏడు వెళ్లింది. మీరు వెళ్లండింక." ఆమె వెడితేనే గాని, ఊదర తగ్గేటట్లు లేదు. తను ఆలోచించుకుని కుదుట పడేందుకు వ్యవధి కావాలి.

ఆరోజు స్వామి దర్శనానికి వెళ్ళాడన్నమాటే గానీ అతని మనస్సు వికలంగానే ఉన్నది. ఇదివరకెన్నడూ ఇంత అన్యమనస్కుడుగా స్వామిని దర్శించనేలేదు.

మధ్యాహ్నం పాపనాశనానికి బయలుదేరాడు. ఇది నాలుగోసారి అతను తిరుపతి రావడం. రెండు రోజుల క్రితం ఎందుకో ఉన్నట్లుండి స్వామి దర్శనం చేసుకోవాలనిపించింది. శశిరేఖను అవధాన్లుగారింట్లో అప్పగించి, బయలుదేరి వచ్చాడు.

ఆ కొండలమధ్య గతుకుల దారిలో రెండు ప్రక్కలా దట్టంగా వ్యాపించి ఉన్న అడవుల మధ్యలోంచి వెడుతూంటే.. తన జీవిత మార్గం కూడా ఇంత కంటకావృతంగా ఉన్నదనిపించింది. చిన్ననాడు చదివినప్పటికీ తనకు భాగవతంలోని భక్తి పారవశ్యత, భగవద్గీతలోని పరమార్థం గోచరించలేదు. ఇటీవల నాలుగేళ్లనుంచే అతని కవి స్ఫురిస్తున్నాయి. అర్థమౌతున్నాయి. తను వాటి పఠనలోనే మునిగి పోతున్నాడు. మనస్సు అతి నిర్మలంగా ఉంటోంది.

అల్లా ఉన్న తన మనస్సును మరల్చివేసింది ఈ శశిరేఖ సమస్య. తను రిటైరైపోతాడు ఇంకో రెండేళ్లకు. ఆ పిల్లకు చదువు, సంధ్య వయస్సు వచ్చాక పెళ్లి ఇవన్నీ జరపాలనే విషయం నిశ్చయమై పోయింది. ఆ బంధనం ఎంత విదిలించుకున్నా అదృశ్యంగా తనను చుట్టుకుంటూంది. 'నాకేమిటి పిల్లతో పని?' అని ఎంత త్రోసివేసుకున్నా ఈ బాధ్యత నీదే సుమా. అన్నట్టు ఆ పిల్ల చిరునవ్వులోంచీ, కన్నీళ్లలోంచీ ఒక హెచ్చరిక కనిపిస్తూ ఉంటుంది.

ఎక్కడి నుంచో, ఎవరో వచ్చి.. లేకపోతే హఠాత్తుగా ఒక అద్భుతం జరిగిపోయి ఈ సమస్యకు పరిష్కారం కలుగుతుందని చాలా సార్లు తను అనుకుంటుండేవాడు. కానీ ఈ నాటితో తన స్థితి స్పష్టమైపోయింది.

"లాంతర్లు తుడిచి, చమురు పోశాను బాబూ... నే ఎడుతున్నా. పాపాయిగోరింకా రాలేదు" అన్నది అచ్చమ్మ. అంటూనే వెళ్లిపోయింది. రామకృష్ణయ్య బల్లమీద కూర్చుని తక్లీ వడుకుతున్నాడు.

వీధి తలుపు కిర్రుమని చప్పుడైంది. చెప్పుల చప్పుడు. ఆ తర్వాత ఒక మగ గొంతు వినిపించాయి. "ఇక్కడ పెట్టనాండీ.. అమ్మగోరూ" అంటూ బండివాడు ఒక పెట్టె పట్టుకొచ్చి మండువాలో పెట్టాడు. రామకృష్ణయ్య కళ్లద్దాలు సవరించుకుని చూశాడు.

ఒక యువతి పిల్లవాడి నెత్తుకుని, మెల్లిగా నడుస్తూ వచ్చింది. మరో పిల్లవాడు నాలుగేళ్ల వాడు ఆమె కుచ్చెళ్లు పట్టుకుని నిలబడ్డాడు.

రామకృష్ణయ్యకు ఒక్క నిముషం కళ్లు చెదిరాయి. ఎవరూ?

"నేనండీ...!" అన్నదామె మృదువుగా.

గుర్తు పట్టాడు రామకృష్ణయ్య. లేచి ముందుకు వచ్చాడు. ఒక్క నిముషం పరకాయించి చూశాడు. సీతే!

అతనికి ఏమనాలో తోచలేదు ఒక్క క్షణం ఆగి "రా అమ్మా! ఇల్లా కూర్చో!" అన్నాడు. బల్ల మీద వచ్చి కూర్చుంది ఆమె. ఆమె వంక చూస్తూ ఉండిపోయాడు. పచ్చని ఛాయలో మెరిసిపోతూంది. చిలకపచ్చ రంగు పట్టు చీరె కట్టుకుని, వంటిన తగుమాత్రం నగలతో నిండుగా ఉంది.

కొంచెం సేపు నిశ్శబ్దంగా గడిచింది. అతను తేరుకున్నాడు. "ఎక్కణ్ణుంచి రావడం?" అన్నాడు.

"విశాఖపట్టణంలో పెళ్లికొచ్చాను. మేము ఉండేది మద్రాసులో. అమ్మ చెప్పే ఉంటుంది" అన్నది.

ఆమె లేచి నిలబడింది. పెట్టె తెరిచి, సబ్బు,తువ్వాలు తీసింది. పిల్లవాడి చేయి పుచ్చుకుని లోపలికి బయలుదేరింది.

"దొడ్లో ఉంటాయిగా నీళ్లు?" అతను తలూపాడు.

ఆమె వెడుతూంటే, వెంట వెళ్లాలనిపించలేదు రామకృష్ణయ్యకి.

ఆమె ఎందుకొచ్చింది. ఇదివరలో తమకున్న సంబంధాన్ని గురించి యోచన కూడా లేనట్లుంది. ఆమె వాలకం చూస్తూంటే. ఎంత నిండుగా హుందాగా ఉన్నది మనిషి. శశిరేఖ ఇంకా రాలేదు. అది వస్తే సీత ఎవరని చెప్పాలి దానికి?

అతను ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఈలోగా సీత వచ్చింది లోపల్నించి. వచ్చి కూర్చుని,పెట్టెలోంచి అద్దం తీసి బల్లమీద పెట్టి, జడ విప్పుకుంది.

ఆమె పాపిడి తీసుకుని తల ఎత్తి అతని వంక చూసింది.

"పాపలేదూ?" అన్నది ఎంత చనువుగా. ఎంత యథాలాపంగా ఉన్నది ఆ ప్రశ్న.

ఉన్నదో లేదో పదేళ్ళ తర్వాత ఈనాడు కావాల్సి వచ్చిందా?

"ఉన్నది" అన్నాడతను. ఇద్దరూ చాలాసేపు మౌనంగా ఉన్నారు. బల్లమీదనుంచి లేచి, వాకిట్లోకి వచ్చి నిలబడ్డాడు అతను. అతనికి ఆ రాత్రి వాళ్లు రావడం, ఆనాటి ఆమె దీనస్థితి గుర్తుకొస్తున్నాయి. అవన్నీ మర్చిపోయినట్టా? లేకపోతే అన్నీ జ్ఞాపకముండే పరామర్శించడానికి వచ్చినట్లా!

అతను లోపలికి వచ్చేసరికి, ఆమె మోకాళ్ల మధ్య ముఖం దాచుకుని కూర్చునుంది. జుట్టు ఇంకా విప్పుకునే ఉంది. ఏడుస్తోంది. భుజాలు కదులుతున్నాయి. ఆపుకుంటున్న ఏడుపు వల్ల.

అతనొచ్చిన అలికిడి విని తలెత్తింది.

"బాబాయి! నిజంగా ఉందా పాప? ఎక్కడున్నది?" ఆమె కళ్లు తడిగా ఉన్నాయి. ముఖమంతా ఎర్రబడి అతి దీనంగా ఉంది.

ఆ పిలుపు కొత్తగా ఉన్నది అతనికి. "ఉన్నది. ఆడుకోవడానికి వెళ్లింది" అన్నాడు మళ్లీ.

అతని వంక క్షణం చూసి, మళ్లీ ఏడ్చింది. "దాన్ని తీసుకుని వెడతాను నేను. నేనుండలేను దాన్ని విడిచిపెట్టి..."

ఏడుస్తూ మాట్లాడుతోంది ఆమె. "ఎప్పుడూ అదే జ్ఞాపకం వస్తూంది. ఏం పాపం చేసిందని దాన్నలా అన్యాయం చేసి వెళ్లాను నేను? ఇక్కడది క్షేమంగా వున్నదని నా మనస్సు నాకు చెబుతూనే వుంది. కానీ దాన్ని చూడాలని నా దగ్గరికి తీసుకోవాలనీ...బాబాయి! నాకు కావాలి.నేను తీసుకువెడతాను."

ఆమెను చూస్తే జాలివేసింది రామకృష్ణయ్యకు. కానీ ఆశ్చర్యంగా ఉంది ఈ రాకడ. శశిరేఖను తీసుకు వెడుతూందా!

పరుగెత్తుకుంటూ వచ్చి,రామకృష్ణయ్యను ఆనుకుని నుంచుంది శశిరేఖ. "తాతా... ఎవరు తాతా?" అన్నది మెల్లిగా. తన దగ్గర ఉన్న శశిరేఖను చూడాలనిపించలేదతనికి. సీత వంక చూశాడు. ఆమె విచ్చుకున్న కళ్లతో చూస్తూంది. బహుశా మొట్టమొదటిసారిగా తన కూతుర్ని.

శశి అడిగిన ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడతను. "అక్క" అన్నాడు. సీత వినలేదు ఈ జవాబు.

"పాపా... దా అమ్మా!" అని దగ్గరకు పిల్చింది సీత. శశి వెళ్ళింది. దాన్ని దగ్గరకు తీసుకుని బావురుమన్నది. శశి బిత్తరపోయి, ఆమె వంక చూస్తూ నిలబడింది. రామకృష్ణయ్య కళ్లలో నీళ్లు తిరిగాయి. అతని గొంతు లోంచి దు:ఖం వస్తూంది. కానీ అణచుకున్నాడు. ఎందుకీ గొడవంతా శశికి తను పడుతున్న వేదన దాని పసి మనసుకి కూడ ఎక్కించాల్సిన అవసరం లేదు.

"ఇల్లారా శశీ" అని పిల్చాడు. సీత చేతుల్ని వదిలించుకుని వచ్చింది శశి. దాన్ని వెంటబెట్టుకుని లోపలికి వెళ్లాడు. దానికి ఏదో సంజాయిషీ చెప్పి సముదాయించాలనీ, దాని మనస్సుకు బాధ కలుగకుండా ఏదో చేయాలనీ ఆత్రుత కలుగుతోంది తన మనస్సులో.

"అక్కయ్య నిన్ను చూసి చాలా రోజులయిందమ్మా. అందుకని అల్లా ఏడ్చింది అంతే. మరి అక్కయ్య బావుందా నీకు?" అన్నాడు బుజ్జగింపుగా.

శశి తల ఊపింది. అతన్ని వదిలించుకుని దొడ్లోకి వెళ్లింది. ముఖం కడుక్కుంటుంటే అక్కడే నిలబడ్డాడు రామకృష్ణయ్య. ఆ ముక్కు, చెంపలు అంతా తల్లి పోలికే. ఇప్పుడు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఆరాత్రికి సీత అతణ్ణి బలవంతం చేసి తనే వంట చేసింది. శశికి కంచంలో అన్నం పెట్టి ప్రక్కనే కూర్చుంది. తన ప్రక్కనున్న ఎడపిల్లవాడిని కూడా గమనించక, దానికి అన్నం కలిపి పెట్టడానికి సిద్ధపడింది. వాడితో చెప్పి 'అక్క' అని పిలిపించింది శశిని.

రామకృష్ణయ్య నిశ్చేష్టుడై చూస్తూ ఉన్నాడు. అతనికి ఇదంతా క్రొత్తగా ఉంది. ఆమె ఆపేక్షగా పిల్లకు అన్నం పెడుతూంటే అక్కడే పీట వాల్చుకుని కూర్చున్నాడు.

రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకు పడుకోలేదు శశి. సీత పిల్లవాడు తన బొమ్మలు తీశాడు. వాటితో ఇద్దరూ ఎంతసేపో ఆడుకున్నారు.

రామకృష్ణయ్య బల్లమీదే కూర్చున్నాడు. అతనికి ఏమీ పాలు పోవడంలేదు. శశిని, పిల్లవాడినీ నిద్రబుచ్చి వచ్చి కూర్చుంది సీత. ఆమెతో ఏమిటి మాట్లాడాలి?

"అమ్మగారు కులాసాగా ఉన్నారా?" అన్నాడతను.

"ఉన్నది. శశిని తీసుకువెళ్లొద్దూ?" లాంతరు వెలుగు ఆమె ముఖాన పడుతోంది. ఆ వెలుగులో ఆమె కళ్లు మినుకు మినుకు మంటున్నాయి.

అదే ప్రశ్న! అదే ప్రశ్న! తీసుకువెళ్లమనడానికీ, వద్దనడానికీ తనకే మిటి అధికారం?

కొంచెం సేపు ఆగి అన్నాడతడు.... "మరి నువ్విల్లా తీసుకు వెడితే మీ వారు ఏమంటారు?" అని

వెంటనే సమాధానం చెప్పిందామె. "ఏమీ అనరు. ఎక్కడో బస్సులో. దిక్కులేక, దారి తప్పిపోయి ఏడుస్తున్న పిల్లని తీసుకొచ్చానని చెబుతాను. ఆయన దేముడులాంటి వారు. నా మాట తీసివేయరు. అదొక్కటే నా అదృష్టం."

ఆమె ఆలోచించుకునే వచ్చిందని స్పష్టమైంది అతనికి. తనకంటే శశి మీద ఆమెకే అధికారం ఎక్కువనిపిస్తోంది.. మళ్లీ అల్లా కాదని అనిపిస్తూంది.

చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు. తన మనస్సులో ఏదో భారంగా వుంది. ఆనాడు తెలతెలవారుతుండగా అచ్చమ్మ చేతుల్లో పసిగుడ్డు శశిని చూస్తే తనకు కలిగిన గుబులు మళ్లీ వస్తోంది. మబ్బు పట్టి, కుండపోతగా కురవడానికి సిద్ధంగా వున్న ఆకాశంలాగా ఉన్నది అతని స్థితి. ఇదే అర్థం కావడం లేదు.

"సీత...!" అని పిల్చాడతను మెల్లిగా. అతని కంఠం గాద్గదికమైంది. "సీతా! నన్ను ఎంత అన్యాయం చేశారు మీరు? నిశ్చింతగా బ్రతుకున్న వాడి మీద అంత భారం వదిలేసి వెళ్లారే? ఏమైనానో అని ఒక్కనాడన్నా అనుకున్నారా?" అన్నాడు. తను తిరుపతిలోనే పార్వతమ్మను అడిగి వుండ వలసిన ప్రశ్న.

"నేను ఆలోచించానని చెబితే మీరు నమ్ముతారా? కానీ అంతకంటే ఎక్కువగా, చాలా ఎక్కువగా నా కడుపు తీపి నన్ను నిలవనిచ్చింది కాదు. మీకు అర్థం కాదు బాబాయి అది. మేము వెళ్లబోయే ముందు అది లేచి ఏడ్చింది. ఊరుకోబెట్టి, నిద్రపుచ్చి వెళ్లాను. అది గుక్కపెట్టి ఏడుస్తుందనీ, పాల చుక్కతో దాని గొంతు తడిపే దిక్కుండదనీ తలచుకుని నేనెల్లా దహించుకు పోయానో! బాధతో నా నరాలు జివ్వుమన్నాయి. ఎన్ని సార్లు తలచుకున్నా, ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే బాధ..... అంత తీవ్రంగా కలుగుతోంది" ఆమె ఏడుస్తూ అంటోంది.

నిజమే ఏమో! తనకు తెలియదు. ఆమె అంటోంది. కానీ శశికోసం ఆమె పడ్డ బాధ తనకి అవగాహన అయినట్లే అనిపిస్తోంది. అతను వినలేదు యింక యీ ప్రసక్తి.

లేచాడు. "అల్లాగే! తీసుకు వెళ్ళు" అనేసి పడుకోవడానికి వెళ్ళిపోయాడు.

ప్రొద్దున్నే ఆమె కాఫీ కాచింది. వంట చేసింది. తొమ్మిదయ్యేసరికి భోజనాలయిపోయాయి. శశి తన బట్టలన్నీ ఒక చిన్న పెట్టెలో పెట్టుకుంది. రామకృష్ణయ్య బజారుకు వెళ్లి సీతకు, శశికి, పిల్లలకు బట్టలు తీసుకు వచ్చాడు. తను చేయవలసిన ఆఖరి ఖర్చు యిదే కాబోలు. రుణం తీరిపోయిందన్నమాట.

శశి తన చిన్న చిన్న సామానులన్నీ పోగేసుకుంటోంది. హడావిడిగా తిరుగుతోంది. "తాతా మరి నువ్వో!" అన్నది హఠాత్తుగా పరుగెత్తుకొచ్చి.

రానని చెబుదామని నోటి చివరి వరకు వచ్చింది. కానీ ఎందుకనో ఆమెను మరపించాలనిపించింది మనస్సుకు. "వస్తానమ్మా. పదిరోజుల్లో వచ్చి నిన్ను తీసుకురానూ!" అన్నాడు. గెంతుకుంటూ వెళ్ళిందామె గదిలోకి.

ఏమిటో గుబులు! సమస్య తీరుతూందన్న సమయంలో తనలో యీ అలజడి ఏమిటి?

ఇంకో పావుగంటలో బండితీసుకొచ్చాడు అతను. సీత అతని ముఖం కేసి చూస్తూంది. మళ్లా తల దించుకుంటున్నది. శశిని క్షణం వదలలేదు ఆమె.

బండి వాడు పెట్టె బండిలో పెట్టాడు. సీత పిల్లవాడిని ఎక్కించి, మళ్లా మెట్ల మీదకు వచ్చి నిలబడింది. అవధాన్లు గారి భార్య వాళ్లు అరుగు మీదకొచ్చి నిలబడ్డారు చూడ్డానికి.

"మరి వెళ్లొస్తాను బాబాయి. ఉత్తరాలు రాస్తూంటాను. మీరు మద్రాసు తప్పక వస్తారు కదూ! ఎడ్రెసు యిచ్చానుగా!" గబగబ అన్నదామె.

బండి వాడు శశి పెట్టె తీసుకొచ్చాడు. శశి కూడా వచ్చింది. రామ కృష్ణయ్య పంచె కుచ్చెళ్లు పుచ్చుకుంది. "తాతా! మరి తప్పకుండా వస్తావా? మళ్ళా నాకు బళ్లో పాఠాలు పోతాయి" అన్నది.

రామకృష్ణయ్య మనస్సు భారమైపోతూంది. ఊపిరాడడం లేదనికి.

సీత రెండడుగులు ముందుకు వేసి, బండి దగ్గర నిల్చుంది. "రా శశి! ఎక్కిస్తా!" అన్నది.

ఎవరో వెనక నుంచి తోసినట్లు ఒక్క అంగలో ముందుకు వచ్చి శశిని ఎత్తుకున్నాడు రామకృష్ణయ్య. దబదబ లోపలికి వచ్చేశాడు.

"నేను పంపను.. నేను పంపను... శశి రాదు నువ్వెళ్ళు" అస్పష్టంగా, గబగబ అంటూ శశిని గుండెలకి హత్తుకున్నాడు.

"వెళ్ళొద్దు శశీ... వెళ్ళొద్దు. ఎప్పుడూ వెళ్ళొద్దు" బిగ్గరగా వెక్కి వెక్కి ఏడుస్తున్న తాతను చూసి, బిత్తరపోయింది శశి.

**(1962)**